
సాక్షి
చిత్తూరు
బుధవారం । 27 । మార్చి । 2024



భారీగా నగదు స్వాధీనం

గుడిపాల మండలంలో ఉన్న రెండు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



మూడు వాహనాలు బోల్తా

మొగిలి ఘాట్‌లో మూడు వాహనాలు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం(ఉ)
చిత్తూరు	6.29	4.52
పుంగనూరు	6.31	4.56

న్యూస్‌రీల్

'సీ-విజిల్' ఫిర్యాదుపై తక్షణం విచారణ



ఫిర్యాదుపై విచారిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా.. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి 'సీ-విజిల్' ద్వారా అందిన ప్రతీ ఫిర్యాదుపై తక్షణం విచారణ చేపట్టి జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక ఇస్తున్నట్లు ఏఆర్వో, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ డా.అరుణ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 19 ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, కలెక్టర్‌కు నివేదిక ఇచ్చామన్నారు. చిత్తూరులోని ఎస్‌బీఐ కాలనీ మొదటి వీధిలో టీడీపీ ఎంపీ అభ్యర్థి డి.ప్రసాద్ రావు కార్యాలయం వద్ద అనుమతులు లేకుండా హోర్డింగ్స్ పెట్టారని సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు రావడంతో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ అధికారులతో కలిసి ఏఆర్వో కమిషనర్ తనిఖీలు చేశారు. కార్యాలయం వద్ద హోర్డింగ్స్, వాహనాలు, సౌండ్ సిస్టమ్‌కు సంబంధించి తీసుకున్న అనుమతులను పరిశీలించారు. అన్నింటికీ సరైన అనుమతులు తీసుకున్నట్లు గుర్తించి, రిటర్నింగ్ అధికారికి నివేదిక అందించారు. తమకు వస్తున్న ఫిర్యాదులను ఎంసీసీ, ఎఫ్ఎస్టీ బృందాలు 30 నిమిషాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుని, రిటర్నింగ్ అధికారికి నివేదికలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ అధికారులు రామకృష్ణుడు, గోపి, గోపాలకృష్ణ వర్మ, పోలీసులు పాల్గొన్నారు.

29న ఉచిత పాలిసెట్ నమూనా పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో ఈనెల 29న ఉదయం 10గంటలకు పాలిసెట్ నమూనా పరీక్షను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 27వ న రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అనుగుణంగా నమూనా పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పాలిటెక్నిక్‌లోని డిప్లొమా కోర్సులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నమూనా పరీక్ష, సదస్సుకు పాలిసెట్ పరీక్ష రాయనున్న విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏడు ఫిర్యాదులపై సమగ్ర విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఎంసీసీ కమిటీకి ఏడు ఫిర్యాదులు అందాయని ఆ కమిటీ నోడల్ అధికారి మురళీకృష్ణ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్‌కు నివేదిక పంపారు. ఈ మేరకు ఈ నెల 26వ తేదీన దినపత్రికల్లో వచ్చిన ఆరు, సోషల్ మీడియాలో వచ్చిన ఒకటి మొత్తం ఏడు ఫిర్యాదులను ఎంసీసీ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించారు. ఆ తర్వాత ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓల నుంచి నివేదికలను స్వీకరించారు. పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం, జీడీ నెల్లూరు, నగరి నియోజకవర్గం పుత్తూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో విచారణ చేసినట్లు చెప్పారు. అలాగే కాణిపాకం ఆలయంలో రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన బుక్‌లెట్‌ల ప్రదర్శన అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా విచారణ చేసి జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల సీఈఓకు నివేదిక పంపారు. ఆలయం వద్ద సామగ్రిని సీజ్ చేసి ఆర్‌ఓ చిన్నయ్య ఎదుట ఒక రూంలో భద్రపరిచారన్నారు. ఈ విషయంలో ఆలయ సిబ్బంది ఓ ప్రముఖ దినపత్రిక జర్నలిస్టుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంసీసీ కమిటీ నివేదికల్లో సూచించారు.

సాంకేతిక పురోగతికి కంప్యూటర్ సైన్స్ అవసరం



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: సాంకేతిక పురోగతికి, భాషా నిర్మాణానికి కంప్యూటర్ సైన్స్ అవసరమని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ట్రెండ్స్ అండ్ టెక్నాలజీస్ టు సాంస్క్రిట్ అండ్ కంప్యూటర్‌సైన్స్' అనే అంశంపై జరిగింది. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్‌తో ఆధునిక తరానికి ఆధునిక పద్ధతుల ద్వారా సంస్కృతాన్ని అందిస్తామన్నారు. ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ బీ.వెంకటరమణ సంస్కృతం, కంప్యూటర్ సైన్స్‌లోని ట్రెండ్స్ అండ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తాత నోట.. మళ్లీ పాత పాట!



ఎక్కడ సింగపూరు.. ఎక్కడ కుప్పం.. బెంగళూరు అభివృద్ధి ఎక్కడ.. కుప్పంలో అభివృద్ధి ఎంత..? ఇవి విపక్ష నేత చంద్రబాబుకు తెలియంది కాదు.. ఓట్ల వేటలో నోటికొచ్చిన హామీలు గుప్పించి అమాయక కుప్పం ప్రజలను బురిడీ కొట్టించడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. 35 ఏళ్లుగా వారిని మభ్యపెట్టిన బాబు ఇప్పుడూ అదేపాట అందుకున్నారు. 'కుప్పాన్ని మరో సింగపూర్ చేస్తా.. బెంగళూరు జనం చదువు, పనుల కోసం కుప్పానికి వచ్చేటట్లు మారుస్తా..' నంటూ అలవిగాని హామీలు గుప్పించేశారు. రెండు రోజులుగా తన రాజకీయ అనుభవాన్నంతా రంగరించి హామీల వర్షంలో కుప్పం ప్రజలను తడిపి ముద్దచేశారు. వీటి అమలు ఎంత.. బాబు హామీల్లో నిజం ఎంత అని స్థానికులు చర్చించుకుంటున్నారు. సంక్షేమ ప్రభుత్వం నీడన ఉన్న చల్లదనం.. సైకిలు ఎక్కితే వచ్చిందా..? అని చర్చించుకుంటున్నారు. బాబు హామీలు.. వాటి విధివిధానాలపై జనం చర్చించుకుంటున్నారు.

- మళ్లీ అలవిగాని హామీలు గుప్పించిన చంద్రబాబు నాయుడు
- ప్రతి ఎన్నికల ముందే ఇవే గొప్పలు
- 35 ఏళ్లుగా అదే తంతు
- అధికారంలో ఉన్నప్పుడు ఒక్కటీ పట్టించుకోని తాత
- బాబు హామీలపై నిలదీస్తున్న కుప్పం ప్రజలు
- గత, ప్రస్తుత ప్రభుత్వాల అభివృద్ధిని బేరీజు వేసుకుంటున్న స్థానికులు

కుప్పం/కుప్పంరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండు రోజుల పాటు అలవిగాని హామీలు గుప్పించారు. ఏడు సార్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు సీఎం హోదా ఉన్నప్పుడు కుప్పాన్ని అభివృద్ధి చేయని తాత మరో అవకాశం ఇస్తే చేస్తానంటూ జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఈసారి అయితే మరో అడుగు ముందుకేసి బెంగళూరు జనం కుప్పం వచ్చేలా చేస్తానంటూ అమలుకు యోగ్యం కాని హామీలు గుప్పించి స్థానికులకు విసుగు తెప్పించారు. ఆయన హామీలపై మీరే ఓ లుక్కేయండి..!

రికార్డు అరిగిపోయింది బాబూ!

- కుప్పాన్ని దేశానికే ఆదర్శం చేస్తా
- పారిశ్రామికవాడ చేసి యువకులకు ఉపాధి కల్పిస్తా
- కుప్పం పట్టణాన్ని శాటిలైట్ సిటీ చేసి, ప్రతి పంచాయతీకి కోటి, మేజర్ పంచాయతీకి రెండు కోట్ల నిధులు కేటాయిస్తా.
- గ్రామాల్లో అభివృద్ధి పనులు స్థానికులే చేసుకునే విధంగా అవకాశం
- ప్రతి గ్రామానికీ రోడ్డు, ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయితో పాటు పొలాలకు సిమెంట్ రోడ్లు వేయిస్తా
- కుప్పాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు బెంగళూరుకు ఫోర్‌వే రోడ్డుతో పాటు ప్రత్యేక విమానాశ్రయం ఏర్పాటు చేస్తా
- కుప్పంలో ప్రతి ఎకరాకు బిందుసేద్యం పరికరాలు ఇచ్చి వ్యవసాయ హబ్‌గా తయారు చేస్తా
- శాశ్వత తాగు, సాగునీటికి హంద్రీ-నీవా జలాలు తీసుకువస్తా
- ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలలను అనుసంధానం చేస్తా.
- ప్రతి మహిళకు నాలుగు ఆవులు ఇచ్చి పాడి పరిశ్రమతో స్వయం ఉపాధి కల్పిస్తా

గతంలో ఇచ్చిన హామీలు గుర్తున్నాయా బాబూ?

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చే వరకు కుప్పంలో కనీసం డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేయని బాబు చదువుల హబ్‌గా ఎలా మారుస్తారని స్థానికులు నిలదీస్తున్నారు.
- పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి టెండర్లు పిలిస్తే తమిళనాడు ప్రభుత్వంతో కలిసి కోర్టులకు వెళ్లింది చంద్రబాబు కాదా..? అని కుప్పం ప్రజలు గళమెత్తుతున్నారు.
- గతంలో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు ఇంజనీరింగ్ కళాశాలతో అనుసంధానం చేస్తామంటే ఎలా నమ్మేదని ధ్వజమెత్తుతున్నారు.
- 2004లో కుప్పాన్ని మరో సింగపూర్ చేస్తామన్న హామీ ఇచ్చి, ఆపై సీఎం హోదాలో మరిచిపోయిన సంగతి గుర్తులేదా..? అంటున్నారు.
- 2001లో పారిశ్రామిక వాడ కోసం అనిమిగానిపల్లి వద్ద శంకుస్థాపన చేసి.. ఇప్పుడు యువతకు ఉద్యోగాలిస్తామనడం తప్పు కాదా అని ప్రశ్నిస్తున్నారు.
- 2018లో ఎయిర్‌పోర్ట్ కోసం శంకుస్థాపన చేసి ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయింది నువ్వు కాదా అని మండిపడుతున్నారు.
- అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు గొప్పలు చెప్పి మరో అవకాశం ఇవ్వాలంటూ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు.

మా నమ్మకం నువ్వే జగన్

నమ్మకానికి మారుపేరు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కుప్పం ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుప్పం పట్టణాన్ని అప్‌గ్రేడ్ చేసి మున్సిపాలిటీ హోదా కల్పించారని గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అలాగే కుప్పాన్ని రెవెన్యూ, పోలీసు డివిజన్లుగా తీర్చిదిద్దారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం అభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని నినదిస్తున్నారు. కలగా మారిన హంద్రీ-నీవాను పూర్తిచేసి కుప్పానికి నీళ్లిచ్చిన ఘనత జగనన్నదని నమ్ముతున్నారు. అదేవిధంగా పాలారు ప్రాజెక్టు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణానికి అడుగులు వేయడం అభివృద్ధికి సంకేతమని చెబుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం, కమ్యూనిటీ భవనాల నిర్మాణం ఎవరి హయాంలో పూర్తయ్యాయో బాబు చెప్పాలని నిలదీస్తున్నారు. మరోమారు జగనన్నను గెలిపించుకుంటే కుప్పం రూపురేఖలు మారడం ఖాయమని గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఈ సారి కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ముక్తకంఠంతో హోరెత్తిస్తున్నారు.

కుప్పంకు బాబు చేసిందేమీ లేదు



చంద్రబాబు కుప్పం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయినా ఆయన చేసింది ఏమీ లేదు. కనీసం కుప్పంలో డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేయలేదు. పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చి డిగ్రీ కళాశాల పెడితే, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణంలో అండర్ బ్రిడ్జీల నిర్మాణం పూర్తిచేశారు. కుప్పంలో శాశ్వత అభివృద్ధి జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందే. ఆయన వస్తే కుప్పం రూపురేఖలు మారతాయని మా నమ్మకం.

– మాధవన్, డీకే పల్లి, కుప్పం మండలం

ఇంతకాలం ఎందుకు చెయ్యలేదు?



ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబు ఇంకో అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానంటున్నారు. 35 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. 3 పర్యాయాలు సీఎంగా ఉండి ఎందుకు చేయలేదు?. కనీసం కుప్పాన్ని మున్సిపాలిటీ కూడా చేయలేకపోయారు. ఆయనను ఇకమీదట ఇక్కడి ప్రజలు నమ్మరు. జగన్‌మోహన్‌రెడ్డి కుప్పానికి చేసిన అభివృద్ధి ఏమిటో జనం ప్రత్యక్షంగా చూశారు. ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ-నీవా కాలువ నిర్మాణం పూర్తి చేసి కుప్పానికి నీళ్లిచ్చారు. రెవెన్యూ, పోలీస్ డివిజన్లు ఏర్పాటు చేసి కుప్పం రూపురేఖలే మార్చేశారు. మరోమారు జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

– కుమార్, డీకే పల్లి, కుప్పం మండలం

నలభై ఏళ్ల సమస్యకు పరిష్కారం

- రూ.1.08 కోట్ల నిధులతో రెండు నెలల కిందట జీఎన్ కండ్రిగ రోడ్డు పనులు ప్రారంభం
- రెండు నెలల్లోనే రోడ్డును పూర్తి చేయించి అందుబాటులోకి తెచ్చిన మంత్రి రోజా
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు



మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న జీఎన్ కండ్రిగ గ్రామస్తులు

నగరి : నాలుగు దశాబ్దాలుగా నిండ్ర మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ, గోవిందప్పనాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ, ఇరుగువాయి, ఇరుగువాయి ఎస్సీ కాలనీ, ఆరూరు, ఆరూరు సెంటరులో నివశించే 600లకు పైగా కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యకు తెర పడింది. నూతన బీటీ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రూ.1.08 కోట్లతో సుమారు రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ రోడ్డుకు ఈ ఏడాది జనవరి నెల 26వ తేదీన మంత్రి ఆర్‌కే రోజా భూమిపూజ చేశారు. నాడు ప్రారంభమైన రోడ్డు పనులు వేగంగా పూర్తి కావడంతో ప్రస్తుతం రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గత పాలనలో రోడ్డు నిర్మాణానికి రూ.56.23 లక్షలు మంజూరు చేసినట్లు ఆర్భాటాలు చేయడంతో పాటు భూమిపూజ చేసి శిలాఫలకం వేశారు. కానీ రోడ్డు పనులే ప్రారంభం కాలేదు. రెండు నెలల క్రితం ప్రారంభమైన రోడ్డు పనులు కేవలం రెండు నెలల్లోపే పూర్తికావడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దశాబ్దాలుగా ఎవరూ చేయనటువంటి ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేస్తూ వచ్చిన మంత్రి ఆర్‌కే రోజా మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. జీఎస్ కండ్రిగ రోడ్డు పనులు పూర్తి కావడంపై గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే పనులను చేయడంలో మంత్రి రోజా ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. తాము రోడ్డు సమస్య గురించి చెప్పిన వెంటనే స్పందించి రోడ్డు పూర్తి చేయించి అందుబాటులోకి తెచ్చిన ఆమెకు కృతజ్ఞతలు అన్నారు. ప్రస్తుతం వేసిన రోడ్డు గోవిందప్పనాయుడు కండ్రిగ, గోవిందప్పనాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ, ఇరుగువాయి, ఇరుగువాయి ఎస్సీ కాలనీ, ఆరూరు, ఆరూరు సెంటరు వరకు ప్రజలకు ఉపయోగపడుతుంది.

వైఎస్సార్‌సీపీలోనే యువతకు పెద్దపీట



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న మంత్రి నారాయణస్వామి, జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

- జగనన్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వలసలు
- సాదరంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువతరానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండల పరిధిలోని టీకేఎం పేటలో 30 మంది యువత మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపీ, ఎంపీటీసీ ధనరాజ్, మాజీ సర్పంచ్‌లు కుప్పారెడ్డి, రంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. నవరత్నాల పేరిట కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేశారని, అందుకే యువత నేడు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని గుర్తు చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఒక ఆర్థిక నేరస్తుడని ఆరోపించారు. ట్రిబుల్ ఇంజిన్ పార్టీగా ఎన్నికల్లోకి వస్తున్న టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న కడప రవి మాట్లాడుతూ తాము టీడీపీ గెలుపుకోసం తొలి నుంచి కృషి చేశామని అయినా గుర్తింపు లేదని వాపోయారు. అలాంటి పార్టీలో ఇమడ లేక పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్న గెలుపునకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. టీడీపీకి కంచుకోటగా ఉంటున్న టీకేఎం పేట గ్రామంలో ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ తమపై అభిమానంతో పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని, యువత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో రఘు, శంకరయ్య, రాము, రవీంద్రబాబు, దూర్వాసులు, మురగేశం, విజయ్, మునిరత్నం, భరత్, రూపేష్, శివప్రసాద్, ప్రదీప్, ప్రశాంత్, లోకేష్, నరేష్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

పలమనేరు.. బాబు మరిచారు !

- సీఎం హోదాలో నాడు పలమనేరుకు వరాలజల్లు కురిపించిన చంద్రబాబు
- రాష్ట్రంలోనే పలమనేరును ఆదర్శవంతంగా చేస్తానని హామీ
- మహిళా డిగ్రీ కళాశాల వెంటనే మంజూరు చేసేస్తామని డాబు
- నేడు పలమనేరులో సీట్ కార్నర్ మీటింగ్‌కు చంద్రబాబు
- గతంలో ఇచ్చిన వాటికే దిక్కులేదు.. ఇప్పుడు మళ్లీ కొత్తవి నెరవేరుస్తారా ? అంటున్న జనం

పలమనేరు: 2014లో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైనప్పుడు పలమనేరుకు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. వచ్చే ఎన్నికల కోసం నేడు ఆయన పలమనేరు పట్టణానికి విచ్చేస్తున్నారు. దీంతో గతంలో ఇచ్చిన హామీలనే పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడొచ్చి ఇంటింటికీ కేజీ బంగారు ఇస్తామన్నా ఎవరు నమ్మతారబ్బా అని జనం అనుకుంటున్నారు. గత టీడీపీ పాలనలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి విచ్చేసిన సీఎం హోదాలో విచ్చేసిన చంద్రబాబు ఈ ప్రాంతానికి పలు వరాలను గుప్పించారు. పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు రామ్మూర్తి అనే దాత రూ.కోటి విరాళం ఇచ్చేందుకు ముందుకు రావడంతో తాను తప్పకుండా కళాశాల ఏర్పాటుకు ఆదేశాలను ఇస్తానని చెప్పారు. అంతేకాక ఈ కళాశాలను మోడల్‌గా చేసి రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతామన్నారు. ఇక ప్రాంతంలోని పట్టురైతుల కష్టాలను తీర్చేందుకు కేంద్రంతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. చైనా నుంచి పట్టు ఉత్పత్తులు అధికం కావడంతో స్థానికంగా ధరలు తగ్గుముఖం పడుతున్నాయని ఇందుకోసం రైతులకు ఇన్సెంటివ్‌ను పెంచేలా చూస్తామన్నారు. పలమనేరు అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తయారు చేస్తా అన్నారు. కానీ ఇవేమీ ఆయన పాలనలో జరగనేలేదు. అప్పట్లో ముఖ్యమంత్రి హోదాలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చని ఆయన మళ్లీ ఇప్పుడు ఎన్నికల కోసం ఇచ్చే హామీలను అమలు చేస్తాడని ఎవరైనా నమ్ముతారా అని టీ కొట్లు వద్ద జనం చర్చించుకోవడం కనిపించింది.

పెయిడ్ న్యూస్‌ను క్షుణ్ణంగా పరిశీలించండి

- ఎంసీఎంసీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్



ఎంసీఎంసీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పెయిడ్ న్యూస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే పెయిడ్ న్యూస్‌ను నిశితంగా పరిశీలించాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలు అభ్యర్థుల పేరుతో వచ్చే ప్రకటనలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, ప్రైవేట్ ఎఫ్ఎంలలో, ప్రింట్ మీడియాల్లో ప్రకటనలకు ముందస్తుగా ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతులు పొందాలన్నారు. పరిశీలించి అనుమతులు ఇస్తామని, లేదంటే చట్టప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, ఎంసీఎంసీ నోడల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమలలో రామ్‌చరణ్


తిరుమలకు చేరుకున్న సినీ నటుడు రామ్ చరణ్

తిరుమల: ప్రముఖ సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. బుధవారం ఆయన స్వామివారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,731 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,156 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.40 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంట ల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కె ట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆర్థిక లావాదేవీలపై నివేదికలు పంపండి

- రూ.10 లక్షలకు పైన జరిగే లావాదేవీల వివరాలను అందించే బాధ్యత బ్యాంకర్లదే
- పోటీలో ఉండే అభ్యర్థుల బ్యాంకు ఖాతాల ప్రారంభానికి సహకరించండి
- బాంకర్ల సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : బ్యాంకుల్లో రూ.10 లక్షలకు పైబడి జరిగే ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నివేదికలను పంపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున బ్యాంకుల్లో రూ.10 లక్షలకు పైబడి లావాదేవీలు జరిగితే ప్రతి లావాదేవి వివరాలను అందజేయాలన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, ఏజెంట్ల పేరుతో ఖాతాలను ప్రారంభించే విషయంలో బ్యాంకర్లు సహకరించాలని కోరారు. వెంటనే వారి ఖాతాలు ప్రారంభించేలా సహకారం అందించాలని తెలిపారు. అభ్యర్థులకు సంబంధించిన నగదు బదిలీ విషయంలో సంబంధిత ఆర్‌ఓలకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. రూ.10 లక్షలకు పైగా లావాదేవీలు జరుగుతున్న ఖాతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 24 బ్యాంకుల పరిధిలో 246 బ్రాంచ్‌లు ఉన్నట్లు చెప్పారు. ఆర్థిక లావాదేవీల విషయంలో సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా బ్యాంకర్లపైనే ఉందన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించకూడదని తెలిపారు. బ్యాంకర్లు నగదు బదిలీ వాహనాలను మార్చకుండా ఉంటే ఆయా వాహనాల నంబర్లు ఇవ్వాలన్నారు. వాహనాలను మార్చి పంపితే ఆ వివరాలను ఆయా ఆర్‌ఓ, పోలీసులకు తప్పకుండా అందించాలని సూచించారు. క్యూఆర్ కోడ్ విధానంలో అనుమతి తీసుకోవాలని చెప్పారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకునేందుకు చుడా వీసీ విశ్వనాథ్‌ను నియమించారు. ఎక్స్‌పెండిచర్ నోడల్ అధికారి కృష్ణారెడ్డికి ఆయా బ్యాంకర్లు వివరాలను తప్పనిసరిగా పంపాలని ఆదేశించారు. సమావేశంలో చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు, ఎల్‌డీఎం హరీష్, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నాడు వెనుకబడిన ప్రాంతం.. నేడు ఆర్థిక కేంద్రం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం.. నేడు ఆర్థిక కేంద్రంగా మారిందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్క్స్ (ఎన్‌సీఎస్‌ఐపీ) చైర్మన్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలో సెజ్ పాలసీలపై అంతర్జాతీయ దృక్పథం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సెజ్‌ల ప్రధాన సమస్యలపై అవగాహన కలిగిన నిపుణులు, విధాన రూపకర్తలు, అధికారులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు ఇందులో పాల్గొన్నారు. 'సెజ్‌లో దృక్పథం, మౌలిక సదుపాయాల వృద్ధి' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొని లోతైన విశ్లేషణలను తెలియజేశారు. శ్రీసిటీలో 29 దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తూ 220 పరిశ్రమలకు నిలయంగా మారిందన్నారు. శ్రీసిటీలో మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లతో కూడిన సమగ్ర పర్యావరణ వ్యవస్థను నెలకొనట్టు వివరించారు.

పేదలకు సేవ చేసే వలంటీర్లు ఉగ్రవాదులా?


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- మరోమారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌పై ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫైర్

పలమనేరు: పేదలకు సేవ చేస్తున్న వలంటీర్లను స్లీపర్ సెల్స్ అని, ఉగ్రవాదులంటూ శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడడం చాలా బాధాకరమని, దీన్ని ఖండిస్తున్నామని మరో దఫా ఇలాంటి విమర్శలు చేస్తే తగిన శాస్తి తప్పదని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫైర్ అయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నాలుగున్నరేళ్లుగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ సేవలు చేస్తున్న విషయం టీడీపీ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో ప్రజల ప్రాణాలు పోతుంటే నాడు సేవలు అందించింది వలంటీర్లు కాదా అన్నారు. అప్పుడు చంద్రబాబు అద్దాల గదిలో దాక్కుంటే టీడీపీ నాయకులు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికల కోసం ప్రజల్లోకి వచ్చి వలంటీర్లను మాట్లాడే అర్హత టీడీపీ నేతలకు లేదన్నారు. వచ్చే నెలలో వలంటీర్లు లేకుంటే వృద్ధులకు, దివ్యాంగులకు పింఛను ఎలా బట్వాడా చేస్తారని, గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల్లా వలంటీర్లు ఏమార్చేవారు కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధుల్లా ప్రజాసేవ చేసేవారిపై బొజ్జల సుధీర్ ఇలాంటి దారుణంగా విమర్శలు చేయడం తగదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, మాజీ పట్టణ కన్వీనర్ మండీసుధా, మున్సిపల్ వైస్ చైర్మన్ రహింఖాన్, కౌన్సిలర్లు నాగరాజు, శ్యామ్ సుందర్‌రాజు, షబీర్, హయాత్, నాయకులు ప్రహ్లాద, గిరిరాజ రెడ్డి, జగ్గ తదితరులు పాల్గొన్నారు.

సేవలందిస్తున్న వలంటీర్లు టెర్రరిస్టులా?

బంగారుపాళెం: ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సేవలు అందిస్తున్న గ్రామ వలంటీర్లను శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి టెర్రరిస్టులతో పోల్చడం దారుణమని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలులో సేవలు అందిస్తున్న వలంటీర్లను ఉగ్రవాదులుగా చిత్రీకరించి వారిని మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా ఉన్నాయన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లకు బొజ్జల సుధీర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

శెట్టిన్ తంగాల్ చెక్‌పోస్టులో నగదు సీజ్


సీజ్ చేసిన నగదు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ

చిత్తూరు రూరల్: చెక్‌పోస్టులో జరిగిన తనిఖీల్లో రూ.7,62,300 సీజ్ చేసినట్లు బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐ వెంకట సుబ్బమ్మ తెలిపారు. చిత్తూరు మండలం శెట్టిన్ తంగాల్ చెక్‌పోస్టులో మంగళవారం బీఎన్‌ఆర్‌పేటలో తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో పొన్నై, చిత్తూరు, ఇతర ప్రాంతాలకు నగదు తీసుకెళ్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,62,300 పట్టుకున్నారు. వారి వద్ద ఆ నగదుకు సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించి భారీ మొత్తంలో నగదు తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. భారీగా డబ్బులు తరలించే క్రమంలో కచ్చితమైన ఆధారాలు ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, బాబు తదితరులు ఉన్నారు.

భారీగా నగదు స్వాధీనం

- మొత్తం రూ.7.78 లక్షల నగదు సీజ్


గొల్లమడుగు చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు

గుడిపాల: మండలంలోని తమిళనాడు సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన రెండు చెక్‌పోస్ట్‌ల్లో రూ.7.78 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్‌ఎస్‌టీ టీమ్‌తో పాటు గొల్లమడుగు చెక్‌పోస్ట్ వద్ద ఏపీ39టిపి1873 గల ఈచర్ వాహనం వేలూరు నుంచి నెల్లూరుకు వెళ్తుండగా తనిఖీ చేయడంతో రూ.2.2 లక్షలు, ముత్తరాశికుప్పం చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో చెన్నై నుంచి ముళబాగిల్ వెళ్తున్న కేఏ51ఏఎఫ్7429 ఈచర్ వ్యాన్‌లో రూ.4.46 లక్షలు, అలాగే చెన్నై నుంచి ముళబాగిల్ వెళ్తున్న టీఎన్42–ఏఏ–5123 నంబరు బొలేరో జీపులో రూ.1.30 లక్షల నగదును ఎటువంటి రశీదులు లేకుండా తీసుకెళ్తుండడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐతో పాటు ఎస్‌ఎస్‌టీ టీం సభ్యుడు గణపతి, ఏఎస్‌ఐలు ఎత్తిరాజులు, రాజేంద్రతో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీహరి, జయరామయ్య పాల్గొన్నారు.

3 తలల వింత దూడ జననం


మూడు తలతో జన్మించిన వింత దూడ

గంగాధర నెల్లూరు: మండలంలోని బుక్కాపట్నం గ్రామానికి చెందిన జీలేటీ అనే రైతు ఇంట ఆవు ఓ వింత దూడకు జన్మనిచ్చింది. మంగళవారం రైతుకు చెందిన ఓ పాడి ఆవుకు మూడు తలలు, మూడు నోళ్లు, మూడు నాలుకలతో పండ్లు ఉన్న వింత దూడ పుట్టింది. దీన్ని గుర్తించిన ఆ రైతు ఇంట్లోని కుటుంబ సభ్యులు మొదట భయభ్రాంతులకు గురయ్యారు. ఈ వింతను చూడడానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి


సంఘటనా స్థలంలో పడి ఉన్న మహేంద్ర మృతదేహం

గంగాధర నెల్లూరు: ట్రాక్టర్ కింద పడి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన గంగాధర నెల్లూరు మండలంలోని అగర మంగళం గ్రామం ద్వారకా నగరం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. లక్ష్మిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన మహేంద్ర (42) తన కుమార్తె మమత పదో తరగతి పరీక్ష రాయగా, ఇంటికి వెళ్లేందుకు ఎదురు చూస్తుండగా ఆ సమయంలో ఎస్ఎస్‌కొండ వైపు వెళ్తున్న ట్రాక్టర్ వచ్చింది. దీంతో మహేంద్ర తన కుమార్తె, మరి కొంతమంది విద్యార్థులతో కలిసి ట్రాక్టర్ ఎక్కారు. అయితే మార్గమధ్యలో అగరమంగళం వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ కిందపడి మహేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ యజమాని భాస్కర్ శెట్టిపై కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మూడు వాహనాలు బోల్తా


మొగిలి వద్ద బోల్తాపడిన కంటైనర్


బోల్తాపడిన టెంపో

- మొగిలి ఘాట్‌లో ప్రమాదం
- తప్పిన ప్రాణాపాయం
- ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున మూడు వాహనాలు బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. బెంగళూరు నుంచి వస్తున్న కంటైనరు మొగిలి ఘాట్ వద్దకు వచ్చేసరికి టైరు పగిలిపోయి అదుపుతప్పి బోల్తా పడింది. దాని వెనుక వస్తున్న మరో లారీ కంట్రోల్ చేయలేక బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. మరి కొద్దిసేపటికే పలమనేరు నుంచి చిత్తూరు వైపు వరిపొట్టుతో వెళ్తున్న ఓ టెంపో రహదారిపై పెట్టిన స్టాపర్లు కనిపించక అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన వంగిలి అనే వ్యక్తి తలకు బలమైన గాయం తగిలింది. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.


గాయపడిన వ్యక్తి

పెద్ద ప్రాణాపాయమే తప్పింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. రహదారిపై వాహనాలు బోల్తాపడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు. మొగిలి ఘాట్‌లో డౌన్‌లో వాహనాలు వేగంగా వస్తుండడంతో అదుపుతప్పి బోల్తాపడ్డాయని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిందుసేద్యం బాగుంది


డ్రాగన్‌ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న ఇజ్రాయిల్ శాస్త్రవేత్తలు

- ఇజ్రాయిల్ శాస్త్రవేత్తలు

కుప్పంరూరల్: కుప్పంలో చేపడుతున్న బిందు సేద్యం బాగుందని ఇజ్రాయిల్ వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉరి రుబెన్‌స్టన్, అట్చాచి, మాషావ్ అన్నారు. మంగళవారం వారు కుప్పంలో చేపడుతున్న ఇండో ఇజ్రాయిల్ వ్యవసాయ క్షేత్రం, చందం, దాసేగౌనూరులోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండో ఇజ్రాయిల్ సహకారంతో చేపడుతున్న బిందు సేద్యంతో ఇక్కడి రైతులు చేపడుతున్న టమాటా, బంతిపూలు, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ పంటలు బాగున్నాయని అభినందించారు. బిందుసేద్యం పరికరాలు అమర్చుకోవడం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో తయారు చేస్తున్న గ్రాఫ్టింగ్ (అంటుకట్టు) మొక్కలు అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకుని నిలబడుతాయని చెప్పారు. ఇక్కడ అధికారులు మార్కెట్‌కు అనుకూలంగా మొక్కలు తయారు చేసి ఇవ్వడం రైతులకు ఎంతో అనుకూలమన్నారు. అనంతరం కత్తిమానుపల్లి వద్ద ఏర్పాటైన రైతు సహకార సంఘాన్ని సందర్శించి రైతు శరవణను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏడీ కోటేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి డింపుప్రియ, అధికారులు అనిత, ఆదిలక్ష్మీ, చంద్రానాయక్, సతీష్, రైతులు ఉన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 27, 28 తేదీల్లో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో అండర్–11, 14 రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు బాలబాలికలకు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పీ.విజయకుమారి తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి బాలబాలికలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. గెలుపొందిన వారు మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

రామచంద్ర యాదవ్‌పై కోడ్ ఉల్లంఘన కేసు

చౌడేపల్లె: భారతీయ చైతన్య యువజన పార్టీ పుంగనూరు అభ్యర్థి బోడె రామచంద్ర యాదవ్‌తో పాటు అతని అనుచరులు మరో ఐదుగురు ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి రామచంద్రయాదవ్ చౌడేపల్లెలో రోడ్డు షోతో పాటు సమావేశం నిర్వహణకు పుంగనూరు ఆర్‌ఓ మధుసూదన్‌రెడ్డి వద్ద పలమనేరు మార్గంలోని చారాల వైపునకు వెళ్లే బస్టాండు కూడలిలో సమావేశం నిర్వహణకు అనుమతి పొందారు. అయితే ఆర్‌ఓ అనుమతి ఉత్తర్వులు ఉల్లంఘించి చౌడేపల్లె ప్రైవేటు బస్టాండు కూడలిలో సమావేశం ఏర్పాటు చేసి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. రామచంద్ర యాదవ్‌తో పాటు హరినాథ్ యాదవ్, నారాయణస్వామి, జంగాలపల్లె వేణు, అతని అనుచరులపై కేసు నమోదు చేశామన్నారు. రోడ్డుపై బాణసంచాలు పేల్చడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో రామచంద్ర యాదవ్‌తో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'విజయం'లో ఇసుక నిల్వలు


అధికారులు సీజ్ చేసిన ఇసుక

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర సమీపంలో ఉన్న విజయం విద్యాసంస్థల్లో భారీగా నిల్వ ఉంచిన ఇసుకను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు–పుత్తూరు దారిలో ఉన్న విజయం కళాశాలలో అక్రమంగా ఇసుకను పెద్ద ఎత్తున నిల్వ చేసినట్లు ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ సుబ్బరాజుకు సమాచారం అందింది. దీంతో రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసులు దాడులు చేశారు. ఇసుక నిల్వలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఇసుకను స్వాధీనం చేసుకుని, కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

2 కిలోల గంజాయి పట్టివేత

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు చెక్‌పోస్టు వద్ద 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు గంగవరం సీఐ కృష్ణమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కోగిలేరు చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో కల సి వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమ యంలో మండలంలోని గౌనివారిపల్లికి చెందిన నగేష్, సుమతి బైక్‌లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బైక్‌తో పాటు గంజాయి ని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

రాణి మృతిపై అనుమానాలెన్నో?

- ఎవరు ఫోన్ చేస్తే ఇంటి నుంచి పరుగెత్తింది ?
- చెవిలో నుంచి రక్తం కారిన ఆనవాళ్లు
- కీలకంగా మారిన మహిళ ఫోన్ కాల్స్ డేటా
- పోస్టుమార్టం నివేదికతో వీడనున్న మిస్టరీ


మూడు రోజుల కిందట మృతిచెందిన రాణి మృతదేహం, ఇన్‌సెట్లో రాణి (ఫైల్)

పలమనేరు: నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండల కేంద్రం ఎంపీడీఓ ఆఫీస్ వెనుకభాగంలో సోమవారం అదే గ్రామానికి చెందిన రాణి (33)అనుమానాస్పద మృతిపై ప్రజల్లో ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆదివారం ఆమె మృతిచెందగా సోమవారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన విషయం తెలిసిందే. అయితే సంఘటన జరిగిన రోజు ఇంట్లో దుస్తులు ఉతుక్కుంటున్న రాణి ఎవరి నుంచో కాల్ రావడంతో పరుగులు తీస్తూ వెళ్లినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. సంఘటనా స్థలంలో ఆమె పాదరక్షలు పడి ఉన్నాయి.సెల్‌ఫోన్ అక్కడే ఉంది. కిందిభాగం దుస్తులు తొలగించబడి ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరైనా ఆమెను అత్యాచారం చేసి ఆపై హత్య చేసుంటారా ? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఆమె చెవిలో నుంచి రక్తం రావడం ఇందుకు మరింత బలం కలిగిస్తోంది. మృతురాలి భర్త రెడ్డెప్ప డ్రైవర్‌గా పనిచేస్తూ ఐదేళ్ల కిందట మృతి చెందాడు. తన కుమార్తెను పుంగనూరులోని అమ్మమ్మ ఇంట్లో విడిచిపెట్టి రాణి ఇక్కడి ఎస్సీ కాలనీలో ఒంటరిగా ఉంటోంది. రోజూ తాపీ పనులకు వెళ్తుండేది. అందరితో కలుపుగోలుగా ఉండే రాణి మృతి అక్కడి వారిని కలచి వేసింది. దీని వెనుక ఏం జరిగిందో పోలీసులు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని కాలనీ వాసులు కోరుతున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు మృతురాలి ఫోన్ కాల్స్ వివరాలు కేసులో కీలకంగా మారనున్నాయి. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసును విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.